

# అక్కడే ఆగక

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

**"చెప్పాగా? నాకూ ఇందాకే తెలిసింది**. నేను చూస్తూండగా ఛాటింగ్ చేస్తే అనుమానం వచ్చేది. అతను దీన్ని పెళ్ళి చేసుకుంటానని బాగా నమ్మించాడు. అందుకే డిజప్పాయింటైంది."

"ప్రేమతో ఆగిందా? లేక ఇంకాస్త ముందుకెళ్ళి..."

"ఛ! అలాంటిదేం లేదు" ఆవిడ గదమాయింపుగా చెప్పింది.

ఆ రాత్రి ఆవిడ అన్నం కలిపి తెచ్చి బతిమాలినా ఆద్య తినలేదు.

"తినకపోతే పో. కాని ఏడ్పు ఆపు తల్లీ. ఎవరో చచ్చినట్లు ఏమిటా ఏడుపు?" ప్రవర్ధన కూతురిని కసిరింది

"నేను చచ్చినా బావుండేది."

"ష్! ఏమిటా మాటలు? నాన్న వింటే?" ప్రవర్ధన కూతుర్ని మందలించింది.

3

ఘానాలో టకరోడీలోని స్లంబర్జే అనే ఆయిల్ కంపెనీలో పనిచేసే చైత్రకి మరో ఇద్దరికీ కంపెనీ సెక్యూరిటీ ఆఫీసర్ మానిటర్లో ఫోటోలు చూపిస్తూ బ్రీఫింగ్ చేసాడు.

"ఇది జరగదనే ఆశాభావంతో దీన్ని ఆరంభిస్తాను. సోమాలియాలోని దుర్మార్గులు అమెరికన్ ఆయిల్ కంపెనీ ఉద్యోగస్థులని బంగారు గనిగా భావిస్తారు. వారిని కనిపెట్టి కిడ్నాప్ చేసి డబ్బిస్తే కాని వదలమంటారు. కాబట్టి మీరు కెనేడియన్ అని చెప్పాలి. మీరు తీసుకెళ్ళే హేండ్‌బేగ్, పర్స్ మీద కెనడా జాతీయ చిహ్నం మేపిల్ ఆకు ఉంటుంది. బై ఎనీ ఛాన్స్, ఆ దురదృష్ట సంఘటన జరిగితే? అది మీకే జరిగితే? అప్పుడు మీరు పాటించాల్సిన నియమాలని జాగ్రత్తగా వినండి" చైత్ర మిగిలిన వారితోపాటు జాగ్రత్తగా వినసాగింది.

"కిడ్నాప్ చేయబడుతూంటే 'హెల్ప్' అని అరవకూడదు. ఫైర్ లేదా పాము అని అరిస్తే అందరూ సహాయానికి వస్తారు. మీరు కిడ్నాపర్స్ ముందు కోపాన్ని ప్రదర్శించకూడదు. వారితో వాదనని, పోట్లాటని అవాయిడ్ చేయాలి. వాళ్ళని రెచ్చగొట్టేలా ప్రవర్తించకూడదు. ఎందుకంటే వాళ్ళంతా ఎక్సైటబుల్ మూడ్‌లో ఉంటారు కాబట్టి చంపేయచ్చు. అందుకే వారంతా ఖాట్ ఆకులని నములుతూంటారు. అది వారిని ఆందోళన, ఆనందాల్లో, హైపర్ అలర్ట్‌నెస్‌లో ఉంచుతుంది. భుజాన పెద్ద అమ్యునేషన్ చెయిన్‌ని ధరిస్తారు. వాళ్ళు మనిషికి పది లక్షల అమెరికన్ డాలర్లని రేన్సమ్‌గా డిమాండ్

చేస్తారు. ఎవరు చెల్లిస్తారని మిమ్మల్ని గుచ్చి గుచ్చి అడుగుతారు. మన కంపెనీ సెక్యూరిటీ నంబర్ ఇవ్వండి. మేము 'ప్రూఫ్ ఆఫ్ లైఫ్' కాల్ అడుగుతాము. అప్పుడు మీతో మాట్లాడిస్తారు. ఐడెంటిఫికేషన్‌కి తల్లి పేరు లేదా మొదటి పెంపుడు కుక్క పేరు అడుగుతాము. వాటిని చెప్పాలి. కంగారు పడకుండా అప్పుడు కొన్ని పదాలని ఉపయోగించాలి. ఉదాహరణకి ఓకేకి, ఐ యాం ఓకేకి అర్థాలు అవికావు. నేనున్న ప్రదేశం నాకు తెలీదు అని చెప్పడానికి ఓకే, తెలుసు అని చెప్పడానికి అయాం ఓకే అని చెప్పాలి. కిడ్నాపర్స్ ఎంతమంది, వారిలో మహిళలు ఎందరు? ఏ దేశం వారో భాష లేదా ఏక్సెంట్‌ని బట్టి గుర్తించారా మొదలైన సమాచారాన్ని మామూలు భాషలో కోడ్‌లో తెలియచేయాలి."

ఆయన ఆ డజన్ కోడ్ మాటలని వివరించాక చెప్పాడు.

"మీకిచ్చే ప్రింటౌట్‌లో ఈ పదాలు, అర్థాలు ఉన్నాయి. వాటిని నిత్యం భోజనానికి మునుపు, తర్వాత చదువుతూ గుర్తుంచుకోండి. అక్కడంతా ఒకే బౌల్‌లోంచి కలిసి తింటారు. దాంతో మీకు డిసెంట్రే, యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్స్ రావచ్చు. ఎనీ క్వశ్చన్స్?"

"ఒకవేళ అదే జరిగితే మేము ఎన్నిరోజులు వారి ఆధీనంలో ఉండాల్సి రావచ్చు?" చైత్ర అడిగింది.

"అమెరికాకి చెందిన ఎన్.జి.ఓ వర్కర్స్‌ని ఇద్దరూ మహిళలే తొంభై మూడురోజులు ఆధీనంలో ఉంచుకున్నారు. ప్రెసిడెంట్ ఒబామా ఆజ్ఞ మేరకి ఇరవైనాలుగుమంది నేవీ సీల్ స్పెషల్ ఆపరేటివ్స్ సోమాలియాలోకి పేరాష్యూట్స్‌తో దిగి కిడ్నాపర్లని చంపి వాళ్ళని రక్షించారు. కాని అన్ని సందర్భాల్లో ఇది జరగదు."

చైత్రతో ఆ స్క్లంబర్‌జే కంపెనీలో పనిచేసే ఎన్రికో, అలెక్సీ కొన్ని అనుమానాలని ప్రశ్నించాక ఆ మీటింగ్ ముగిసింది.

మీటింగ్ ముగిసాక ఇంటికి వెళ్తూ చైత్ర తన తండ్రినించి మిస్డ్ కాల్‌ని చూసి, ఎందుకు చేసారా అనుకుంటూ తండ్రికి ఫోన్ చేసింది.

చైత్ర ముందు తండ్రితో మాట్లాడాక ఆయన ఫోన్ భార్యకి ఇవ్వగానే ఆవిడ అపార్ట్‌మెంట్ టెర్రెస్ మీదకి వెళ్ళి ఆద్య విషయం వివరించింది. చైత్ర అంతా నిశ్శబ్దంగా విన్నాక అడిగింది.

"దాని చదువు ఎలా సాగుతోంది? ఏమైనా చదువుతోందా? బేక్‌లాగ్స్ ఉన్నాయా? పర్సెంటేజ్ ఎంతొచ్చిందో తెలుసా?"

"తెలీదు."

"తెలుసుకోవాలి. ఎప్పుడైతే ఇలాంటి వాటిమీదకి మనసు మళ్ళిందో అప్పుడు చదువుమీద కాన్సన్‌ట్రేషన్ తగ్గుతుంది. దాన్ని పిలు మాట్లాడతాను. నేను లైన్‌లో ఉంటాను."

"అక్క లైన్లో ఉంది నీతో మాట్లాడుతుందిట" ఆవిడ కిందకి వెళ్ళి ఆద్యతో చెప్పింది.

రెండుసార్లు ఆవిడ ఆ మాటలు చెప్పాక ఆద్య బలహీనంగా చెప్పింది.

"నేను ఇప్పుడు మాట్లాడనని చెప్పు."

"ఎవరో కాదు. మాట్లాడుతానన్నది అక్కే" ఆవిడ కోపంగా నెత్తిన మొట్టి చెప్పింది.

"ఇంద్రుడు స్వర్గం నించి మాట్లాడుతానన్నా నేను ఇప్పుడు మాట్లాడనని చెప్పు" ఆద్య ఏడుస్తూ తీవ్రంగా చెప్పింది.

స్పీకర్ ఆన్ చేయడంతో ఆ సంభాషణ మొత్తం విన్న చైత్ర చెప్పింది.

"ఒసేయ్ మొద్దు. విను. నీకు ప్రపంచం తెలీదు. నీకే కాదు. ఇండియాలోని నీ వయసు వాళ్ళెవరికీ ఏది విలువైందో, ఏది విలువ లేనిదో తెలీక విలువలేని వాటి వెంటపడి సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. నీ టార్గెట్ ఇప్పుడు మంచి జిపిఏతో ఇంజనీరింగ్ పాసవడం. పెళ్ళి గురించి ఆలోచించాల్సిన వయసు కాదు నీది. నీ వయసు ఫ్రెండ్స్‌లో ఎంతమందికి పెళ్ళిళ్ళయ్యాయో చెప్పు? ఇట్స్ టూ ఎర్లీ నౌ. ఇరవై నాలుగు, ఇరవై ఐదో ఏడు దాటాక అది ఆలోచించాలి. ఒకడు నిన్ను ఇష్టపడ్డాడు. తర్వాత కుదరదన్నాడు. ఇష్టపడటంలో తప్పులేదు. కుదరకపోవడంలో కూడా తప్పులేదు. అదేమీ మంచమెక్కి ఏడవాల్సిన అంతర్జాతీయ సమస్యకాదు. నీ ఫ్రెండ్స్‌లో ఎంతమందికి బ్రేకప్ ఐందో నీకు తెలీదు. వాళ్ళు చెప్పి ఉండరు" చైత్ర అనునయంగా చెప్పింది.

"నన్ను ఎవరితో పోల్చక. వాళ్ళ సంగతి వేరు. నా సంగతి వేరు."

"వినలేక చస్తున్నాం తల్లీ. ముందా ఏడుపు ఆపు. అందరి సంగతీ ఒకటే. అంతెందుకు? అమ్మే ఎవర్నో చేసుకోవాలని అనుకుంది. చివరికి నాన్నని వేరే కేస్టయినా లవ్ మేరేజ్ చేసుకుందని మనకి తెలీదా? ఈ రోజుల్లో ఇది నార్మల్. చాలామందికి జరిగేదే. జస్ట్ టేకిట్ ఈజీ అండ్ టేకిట్ లైట్. నువ్వు ముందు లేచి స్నానం చేసి, అన్నం తిని పడుకో. కావాలంటే నిద్రమాత్ర వేసుకుని పడుకో."

చెల్లెలికి హితబోధ చేసాక చైత్ర తల్లితో చెప్పింది.

"నాకు ఆన్‌లైన్‌లో ఆఫీస్ మీటింగ్ ఉంది. వెళ్తాను. రేపు మళ్ళీ ఫోన్ చేస్తాను."

"అలాగే."

"రేపు దాన్ని కాలేజీకి పంపొద్దు."

"నేనూ అదే అనుకున్నాను. నాన్న ఆఫీస్‌కి వెళ్తారు కాబట్టి మళ్ళీ రేపు ఉదయం ఫోన్ చేసి దానికి నువ్వే కౌన్సిల్ చేయాలి."

"సరే. నాకు దానిమీద కోపం వస్తోందమ్మా. నన్నడిగితే ఇదసలు సమస్యేకాదు. ఎదుటివాళ్ళు 'ఒద్దు. చేసుకోను' అంటే అవమానపడి మంచం ఎక్కడమేనా? ఇప్పుడే ఇలా రియాక్ట్ అవుతూంటే, రేపు జీవితంలో ఎన్నో సమస్యలు వస్తాయి. అప్పుడో?"

"ఏమిటో తల్లీ. నాకు అంతా అగమ్యగోచరంగా ఉంది" ప్రవర్ధన కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

4

మర్నాడు ఉదయం సంజీవ ఆఫీస్‌కి వెళ్ళాక ప్రవర్ధన ఆద్యతో చెప్పింది.

"ఇంకా ఏడుపు ఆపలేదు? మొహం చూడు. చాటలా ఎలా ఉబ్బిందో, అసలు రాత్రి నిద్రపోయావా? ఏడుస్తూనే ఉన్నావా? లేచి మొహం అద్దంలో చూసుకో"

ఆద్య జవాబు చెప్పలేదు. ఆమె కూతురు మొబైల్‌ని చూసింది. జినేంద్రకి పధ్నాలుగు కాల్స్ చేసింది. అతను ఒక్కదానికీ ఆన్సర్ చేయలేదు.

"ఎందుకే? ఇంక అతన్ని మర్చిపో. అతను కాదన్నాడు. దాంతో దీనికి ఫుల్‌స్టాప్ పెట్టు. లే. లేచి ముందు మొహం కడుక్కుని స్నానం చేసిరా. నిన్న ఇంటికి వచ్చినప్పటినించి ఏం తాగలేదు. తినలేదు. కాఫీ అలాగే ఉంది" ఆవిడ బాధగా చెప్పింది.

ఆద్యని బలవంతంగా లేపి బాత్రూంలోకి పంపించింది.

ఆద్య అద్దంలో చూసుకుంటూ బ్రష్ మీద పేస్ట్ వేసుకుంది. ఆమెకి 'ఒకే గ్లాస్‌లో మనిద్దరి టూత్ బ్రష్‌లు ఉండే సమయంకోసం ఎదురు చూస్తున్నాను' అనే జినేంద్ర పంపిన మెసేజ్ గుర్తొచ్చింది.

'అతను ఎందుకలా తనని మోసం చేయాలి?' అన్న ఆలోచన, తక్షణం ఏడుపు తన్నుకు వచ్చాయి. తను చేసినా అతన్నించి తనకి ఒక్క ఫోన్ కాల్ కూడా రాలేదు. జినేంద్రని తిట్టాలని ఉంది. కాని తల్లి సలహా గుర్తొచ్చింది. ఏ మనిషితోనైనా సఖ్యతగా విడిపోవాలి కాని పోట్లాటతో కాదు. ముందువన్నీ మాయమై కొందరికి ఆఖరి ఇంప్రెషనే జీవింతాంతం గుర్తుండిపోతుంది. అతన్నించి ఫోన్ వస్తుందేమోనని మరో రోజుదాకా ఆగి చూడాలని నిర్ణయించుకుంది. తనకి సారీ చెప్పినప్పుడు అతని మొహంలో బాధ కనిపించకపోవడం ఆద్యని బాధించింది. అది గుర్తొచ్చి, తనని ఉపయోగించుకున్నాడనే భావోద్వేగాలు ఆమెలో తన్నుకు వచ్చాయి. అలర్ట్ విని మెసేజ్‌ని చూసింది. స్నేహితురాలు హవిష్యనించి.

'సారీ. నువ్వు ఆఫ్‌లైన్, తూలిక ఆన్‌లైన్. ముహూర్తం నిశ్చయించారని తెలిసింది.'

'అమ్మా!' అన్న కూతురు కేక విని తల్లి బాత్‌రూంలోకి పరిగెత్తింది. నేలమీద పడున్న ఆద్య, పక్కనే ఖాళీగా పడున్న గోళ్ళ రంగు సీసా కనిపించాయి. వెంటనే కూతురు నోరు తెరిచి చూస్తే నోరంతా ఎర్రగా కనిపించి, వార్నిష్ వాసన వేసింది.

ఆద్య జవాబు చెప్పలేదు. చెంపమీద కొట్టాక ఆద్య స్పృహలో లేదని అర్ధమైంది. కాళ్ళూ, చేతులూ వణుకుతూంటే లేచి తక్షణం భర్తకి ఫోన్ చేసింది.

"అమ్మాయిని హాస్పిటల్‌కి తీసుకెళుతున్నాను. మీరు వెంటనే ఓం సాయిరాం హాస్పిటల్‌కి రండి."

"బాలేదు. రండి. చెప్తాను."

ఆవిడ ఇంటర్‌కంలో వాచ్‌మేన్‌కి ఫోన్ చేసి చెప్పింది.

"ఉన్నపళంగా పైకిరా. ఎమర్జెన్సీ."

గబగబా మొహం చన్నీళ్ళతో కడుక్కుని బొట్టుపెట్టుకుంది. బీరువా లాకర్లో ఎమర్జనీకోసం దాచిన పదివేల రూపాయలున్న కవర్ని అందుకుని హేండ్‌బేగ్‌లో ఉంచుకుంది. గుర్తురాగానే బాత్‌రూములోకి వెళ్ళి ఖాళీ గోళ్ళరంగు సీసాని తీసుకుని హేండ్‌బేగ్‌లో వేసుకుని వాచ్‌మేన్‌ని సాయం పట్టమని లిఫ్ట్‌లో మూడో అంతస్థులోంచి స్పృహలో లేని ఆద్యని కిందకి తీసుకెళ్ళింది.

"ఏమైందమ్మా?" అతను కంగారుగా అప్పటికే మూడుసార్లు అడిగినా ప్రవర్ధన జవాబు చెప్పలేదు.

తమ కారు తాళం చెవిని అందించింది. సంజీవ రోజూ ఆఫీస్‌కి బైక్ మీదే వెళ్తాడు. కుటుంబంతో వెళ్ళడానికే అతను కారుని వాడతాడు.

అతను తలుపు తెరవగానే తమ కార్లో ఆద్యని వెనక సీట్లో పడుకోబెట్టాక చెప్పింది.

"ఎక్కు. నువ్వే మమ్మల్ని హాస్పిటల్లో దింపాలి."

వాచ్‌మేన్ తన భార్యని పిలిచి నీళ్ళ టేంక్ నిండగానే ఆఫ్ చేయమని చెప్పి కారెక్కి బయటకి పోనిస్తూ మరోసారి అడిగాడు.

ఏమైంది అమ్మగారు?"

"రాత్రినించి ఒంట్లో బాలేదు."

అదే కాలనీలోని హాస్పిటల్‌కి ఐదు నిమిషాల్లో చేరుకున్నారు. ఇద్దరూ ఆద్యని లోపలికి మోసుకెళ్ళి బెంచీమీద పడుకోబెట్టారు.  అతన్ని బయట ఉండమని ప్రవర్ధన ఓ నర్స్‌తో చెప్పింది.

"మా అమ్మాయి సీరియస్‌గా ఉంది. ఎమర్జన్సీ కేసులు చూసే డాక్టర్‌గారు ఉన్నారా?"

"ఏమైంది?"

"పొరపాటున పాయిజన్ తాగింది."

"ఓ!ఉండండి" చెప్పి వెళ్ళి ఇంకో నర్స్‌తో వచ్చింది.

ఆమె ఆద్య కనురెప్పల్ని ఎత్తి చూసి అడిగింది.

"ఏం తాగింది?"

"గోళ్ళ రంగు."

"ఎంతసేపైంది?"

"పావుగంటలోపు" గట్టిగా ఊపిరి పీల్చుకుని చెప్పింది.

ప్రవర్ధన హేండ్‌బేగ్‌లోంచి ఆ నెయిల్ పాలిష్ సీసాని పట్టుకుని ఇంటర్‌కంలో ఓ డాక్టర్‌కి సమాచారం ఇచ్చి ఆద్యని వీల్ చెయిర్లో కూర్చోపెట్టి వేరే గదిలోకి తీసుకెళ్ళింది. నిమిషంలో ఈ ఏభై ఏళ్ళ డాక్టర్ హడావిడిగా ఆ గదిలోకి వచ్చాడు. జరిగింది చెప్పింది. ఆయన దాని లేబిల్‌ని శ్రద్ధగా చదివి చెప్పాడు.

"సిస్టర్ ముందు స్టమక్ వాష్‌కి ఏర్పాట్లు చూడు. మరియమ్మని పిలిచి ఐవి పెట్టమను."

"మీరు ముందు రిసెప్షన్ దగ్గరకి వెళ్ళి ఎడ్మిషన్ రాయించండి" నర్స్ ప్రవర్ధనతో చెప్పింది.

ఆ గదిలోంచి ప్రవర్ధన బయటికి వచ్చి రిసెప్షనిస్ట్ దగ్గరకి వెళ్ళింది. ఆమె ఐదువేలు కట్టమని కోరితే కట్టింది.

అరగంట తర్వాత సంజీవ ఆ హాస్పిటల్ బయట బైక్ దిగి లోపలకి వచ్చి రిసెప్షనిస్ట్‌ని అడిగి ఆద్య పడుకున్న గదిలోకి వెళ్ళాడు.

"ఏమైంది?" మంచమ్మీద ఆద్య పక్కనే దుఃఖంగా కూర్చున్న భార్యని అడిగాడు.

"చెప్తాను. ముందు మీరెళ్ళి ఈ మందు కొనుక్కురండి. బయట షాప్‌లో లేదు."

"అది సరే. అసలేమైంది?"

"చెప్తానన్నాగా" ఆవిడ ఏడుస్తూ చెప్పింది.

"నిన్నటినించి ఏదో జరుగుతోందని నాకు తెలుసు" సంజీవ ఆక్షేపణగా చెప్పాడు.

"ఇంటికెళ్ళి నా ఫోన్ తీసుకురండి. హడావిడిలో మర్చిపోయాను" బయటకి వెళ్ళే భర్తతో ప్రవర్ధన చెప్పింది.

ఆద్యకి స్పృహ వచ్చాక కళ్ళు కనిపించలేదు. ఆమె తల్లితండ్రుల గుండెల్లో రాయి పడింది. కూతురికి చూపొస్తే జీవితాంతం ఉప్పు మానేస్తానని ప్రవర్ధన వెంటనే షిరిడిసాయికి మొక్కుకుంది. తల్లే స్టీల్ బేసిన్‌ని మంచం మీద ఉంచితే పళ్ళు తోముకుని, మొహం కడుక్కుంది. చెయ్యి పట్టుకుని బాత్‌రూముకి తీసుకెళ్ళి, పనయ్యేదాకా అక్కడే నిలబడి తర్వాత ప్రవర్ధన ఫ్లష్ చేసింది. ఆ ఒక్క చర్య ఆద్యని బాధించింది.

తల్లి ఆ రాత్రి హాస్పిటల్లో కూతురికి తోడుగా పడుకుంది. రాత్రి చైత్రనించి వాట్సప్ కాల్‌ని రిసీవ్ చేసుకోగానే ప్రవర్ధన తన పెద్ద కూతురు చైత్రకి జరిగింది వివరించింది.

"అయ్యయ్యో. కళ్ళు కనపడకపోవడమే? ఎంత తెలివి తక్కువది. ఇప్పుడు ఎలా ఉంది?" చైత్ర ఆదుర్దాగా అడిగింది.

"నిద్రపోతోంది."

"నాన్నెలా ఉన్నారు?"

"దానిమీద పండిపడలేక ఎప్పుడూ లేంది నామీద మండిపడ్డారు. నా పెంపకం వల్లే ఇలా తయారైంది అన్నారు. ఆయన ఫ్రస్టేషన్‌ని అర్థం చేసుకోగలను. నాకంతా అయోమయంగా ఉంది. దాని ఆరోగ్యం ఏమవుతుందో అని భయంగా ఉంది."

"దానికేం కాదులే అమ్మా. నువ్వు, నాన్న ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి."

చైత్ర చాలాసేపు తల్లిని ఓదార్చి, ధైర్యం చెప్పింది.

"నేను రేపు మళ్ళీ ఫోన్ చేస్తాను" చైత్ర ఫోన్ కట్ చేసింది.

మర్నాడు ఆద్యకి తిరిగి క్రమంగా దృష్టి రాసాగింది. మొదటగా మంచం ఎదురుగా గోడకి కనిపించిన బోర్డ్‌ని చదివిన ఆద్యకి అంత బాధలోనూ నవ్వొచ్చింది.

'పేషెంట్స్ ఎక్స్‌పైరీ డేట్ ఎక్స్‌టెండెండ్ హియర్ '

ఆద్య రెండు రోజులు హాస్పిటల్‌లోనే ఉంది. తమ విధిగా డాక్టర్  పోలీసులకి ఆ కేస్ గురించి ఫిర్యాదు చేయడంతో రెండోరోజు పోలీసులు వచ్చి ప్రశ్నించారు.

"మీ పేరు?" హెడ్ కానిస్టేబుల్ ప్రశ్నించాడు.

"ఆద్య."

"మీరు ఎందుకు విషం మింగారు?"

"విషం కాదు. గోళ్ళరంగు" ప్రవర్ధన చెప్పింది.

"మీరెవరు?" అతను ఆవిడవైపు తిరిగి ప్రశ్నించాడు.

"ఆద్య మా అమ్మాయి."

"నేను ప్రశ్నలు అడిగేది మీ అమ్మాయిని. మీరు జవాబులు చెప్పకండి. చెప్పమ్మ. దేనికి ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నావు?" అతను మళ్ళీ ప్రశ్నించాడు.

"ఆత్మహత్య కాదు. వాసన చూస్తూంటే కొద్దిగా గొంతులోకి వెళ్ళింది" సంజీవ తన కూతురు ఇరుక్కోకూడదని చెప్పాడు.

"మీరిద్దరూ బయటకి వెళ్ళండి" అతను కసిరాడు.

"మా నాన్న చెప్పింది కరెక్టే, దాన్ని వాసన చూస్తూంటే గొంతులోకి వెళ్ళింది" ఆద్య నీరసంగా చెప్పింది.

కానిస్టేబుల్ కేస్ బుక్ చేయనందుకు ఐదువేలు అడిగితే సంజీవి నాలుగువేల రూపాయలకి బేరమాడి అదిచ్చి పంపించాడు.

ఆత్మహత్య నేరం కాదనే తీర్పు సుప్రీం కోర్ట్ 2017లో వెలువడిందని ఆయనకి తెలీదు.

"మన పెంపకంలో లోపమా?" ఆ రాత్రి సంజీవ తన భార్యని బేలగా అడిగాడు.

"కాదు. చైత్రని ఎలా పెంచామో దీన్నీ అలాగే పెంచాము. స్వభావాలు."

కొద్దిసేపాగి భర్త చేతిని తన చేతిలోకి తీసుకుని మళ్ళీ చెప్పింది.

"మీరు ఇదవకండి. కాలం కూడా. మా రోజుల్లో ఆడపిల్లలకి ఇంత స్వేచ్ఛలేదు. ముఖ్యంగా వాట్సప్ లాంటివి వచ్చాక నేటి పిలల్లకి స్వేచ్ఛ పెరిగింది. నేడు కొందరు దాన్ని ఇలా దుర్వినియోగం చేస్తూంటారు. దీనిలా కాక చాలామంది దాన్ని లైట్‌గా తీసుకుని అంతటితో వదిలేస్తారు. అతను బాగా నమ్మించాడు."

"మోసపోయింది. జీవితం ఎంతో పెద్దది. అందులో ఇదో పేజీ మాత్రమే అని చెప్పు. ఐనా ఈ రోజుల్లో 'స్పేస్' అనే పదం తరచు వినిపిస్తోంది. స్పేస్ అంటే సెల్ఫ్ కేర్ కాదు. స్వార్ధమే స్పేస్. 'నా స్పేస్ నాకివ్వు' అని భార్య భర్తని అడుగుతోంది. ఏ విషయంలోనూ స్పేస్ ఉండకూడనివారే భార్యాభర్తలు. స్వార్ధం. 'ఆ సమయంలో నువ్వు నాకొద్దు అనడమే స్పేస్. ఇంకో మనిషికి ఇష్టంలేనిది చెయ్యడమే స్పేస్. వాళ్ళు తాత్కాలిక స్పేస్‌లో జీవించేకన్నా బెస్ట్ ఆప్షన్ ఉంది. విడాకులు తీసుకుని పూర్తి స్పేస్‌లో జీవించచ్చు .ఆ పని చెయ్యడానికి సమాజంలో ఇంకా అందరికీ ధైర్యం చాలడంలేదు" సంజీవి సమాజంలో తను చూసిన వాటిని క్రోడీకరించి చెప్పాడు.

5

ఇంటికి వచ్చేసామని తల్లి ఇచ్చిన మెసేజ్ చూసి చైత్ర ఫోన్ చేసింది.

"నేను ఆఫీస్ పనిమీద ఛాడ్ అనే దేశానికి వెళ్ళొచ్చాను. అక్కడ బిజీగా ఉండి ఎక్కువసేపు మాట్లాడలేకపోయాను. మళ్ళీ టకరోడీకి వచ్చాను. అదెలా ఉంది?" అడిగింది.

"బానేవుంది. పడుకుంది."

"దానికి సెమిస్టర్ హాలిడేస్ ఎప్పట్నించి?"

"వచ్చే సోమవారం నించి."

"ఐతే ఆద్యని నా దగ్గరకి పంపు."

"దేనికి?" ప్రవర్ధన అడిగింది.

"కౌన్సిలింగ్‌కి. సెల్ఫ్ కౌన్సెలింగ్‌కి. జీవితం అంటే ఏమిటో దానికి తెలియాలి. బావిలో కప్పలా అదే సమాజంలో, అదే ఫ్రెండ్స్‌తో ఉంటే అంతే. అది సరేనంటే టిక్కెట్, వీసా కాగితాలు పంపిస్తాను."

"దాంతో నేనూ వస్తాను."

"నువ్వెందుకు? దాన్ని మాత్రమే పంపు."

"ఇప్పుడున్న పరిస్థితుల్లో దాన్ని ఒంటరిగా పంపడం ప్రమాదమేమోనని ఆలోచిస్తున్నాను."

"ఏం ప్రమాదం?"

"దారిలో మళ్ళీ ఏదైనా అఘాయిత్యం చేస్తే.."

"చెయ్యలేదు. ఏర్‌పోర్ట్ బయట మీరు దింపుతారు. అది ఓసారి గేట్ దాటి విమానాశ్రయంలోకి వస్తే, ఇక చావాలన్నా కుదరదు. లిక్విడ్స్ ఎలౌచేయరు. కాబట్టి గోళ్ళ రంగ్ సీసాల్లాంటివి దగ్గర ఉండవు. ఆయుధాలని అనుమతించరు. ఉరి తీసుకుందామన్నా కుదరనంత ఎత్తు సీలింగ్‌లు. విమానం ఎక్కేదాకా ఒక్క రెస్ట్ రూం బూత్‌లో తప్ప మిగతా అన్ని చోట్లా మనుషులు ఉంటారు. అక్కడా ఆత్మహత్యకి ఉపయోగించే ఏమీ ఉండవు. ఎక్కాక విమానంలో ఏం చేయలేదు. మధ్యలో ఆడిస్ అబాబా ఏర్‌పోర్ట్‌లో దిగి విమానం మారాలి. అక్కడా అంతే. ఆక్కడికి చేరుకునేసరికి కొంత ఊరట కలుగుతుంది. టకరోడిలో విమానం దిగాక నేను దాన్ని అరైవల్స్ లాంజ్ అవుటర్ గేట్ దగ్గర రిసీవ్ చేసుకుంటాను. కాబట్టి దారిలో అది బద్రంగానే ఉంటుంది."

"అక్కడ? నువ్వు ఆఫీస్‌కి వెళ్ళినప్పుడు? వెంట తీసుకెళతావా? అప్పుడు ఏమైనా అఘాయిత్యం చేస్తే?"

"అదంతా నా బాధ్యత. దాన్నైతే ముందు పంపు. నో అనరని తెలిసినా నాన్నతో చెప్పు. రెండు రోజుల్లో టిక్కెట్ కొని నాన్న ఈమెయిల్‌కి పంపుతాను. ప్రింటవుట్ తీసిచ్చి ఏర్‌పోర్ట్ బయట దింపండి. అదృష్టవశాత్తు ఘానాకి ఇండియన్స్‌కి వీసా ఆన్ అరైవల్. దాని పాస్‌పోర్ట్ సేఫ్‌గా ఉంది కదా?"

"బీరువాలో ఉంది."

"దాని స్కేండ్ కాపీ నా దగ్గర ఉంది. ఎందుకైనా మంచిది. పాస్‌పోర్ట్ ఉందో లేదో చూసి చెప్పు ముందు. లైన్లో ఉంటాను."

ప్రవర్ధన బీరువా తెరచి చూసి ఉందని చెప్పాక చైత్ర చెప్పింది.

"ఎంత త్వరగా విమానం ఎక్కితే అంత మంచిది. అది లేచాక మెసేజ్ పెట్టు. దాంతో మాట్లాడతా. టిక్కెట్ కొన్నాక రానంటే వృధా. నాన్న ఆఫీస్‌కి వెళ్ళారా?"

"అవును. ఇవాళ్టినించే వెళ్తున్నారు."

"సరే. నాన్నకి ఆఫీస్‌కి ఫోన్ చేసి మాట్లాడతాను. నాన్నకూడా దాన్ని పంపడానికి ఒప్పుకంటే టిక్కెట్స్ కొని పంపుతాను అర్ధమైందా?"

"ఐంది. నాన్నగారితో ముందీ ప్రయాణం విషయం మాట్లాడు."

"అలాగే. ఇప్పుడే మాట్లాడుతాను" చెప్పి లైన్ కట్ చేసి చైత్ర తండ్రికి ఫోన్ చేసింది.

"దాన్ని నీ దగ్గరకి పంపితే ఏం చేయగలవు?" సంజీవ అడిగాడు.

కొన్ని క్షణాలు ఆలోచించి చైత్ర చెప్పింది.

"ఛాడ్‌లో నన్నొకరు సమస్యని ఎలా సాల్వ్ చేయగలవని అడిగారు. నేను చెప్పిన జవాబులో భాగం ఇది. పనామా కాలువని నిర్మించిన కల్నల్ గోథల్స్ వాతావరణం, జాగ్రఫీలాంటి చాలా సమస్యలని ఎదుర్కొన్నాడు. అతను ఎదుర్కొన్న వాటిలోని పెద్ద సమస్య విమర్శ. దాని నిర్మాణం అతనివల్ల కాదని. ఆ విమర్శలకి అతనిచ్చిన సమాధానం, దాన్ని పూర్తి చేయడమే. ఎదురైన ప్రతీ సమస్యని పరిష్కరించుకుంటూ తన లక్ష్యాన్ని నెరవేర్చాడు."

"సరే. అలాగే కానివ్వమ్మ" సంజీవ ఒప్పుకున్నాడు.

మళ్ళీ తల్లికి ఫోన్ చేసింది.

"నాన్న ఒప్పుకున్నారు. దాన్ని నిద్రలేపి స్పీకర్ ఫోన్ ఆన్ చెయ్యి. మాట్లాడతాను.. హలో డాలీ ఎలా ఉన్నావు?" అడిగింది.

మేలుకున్న ఆద్య జవాబు చెప్పలేదు.

"నువ్వు ఇప్పుడు మాట్లాడవని నాకు తెల్సు. చెప్పేది విను. నాన్న ఓకే అన్నారు కాబట్టి నువు వెంటనే ఇక్కడికి రా. టిక్కెట్ పంపిస్తాను. అక్రా చేరుకున్నాక వీసా తీసుకోవచ్చు. అక్ర ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్ చాలా చిన్నది. బయటకి వచ్చేదారిలో కుడివైపు రెండు కిటికీలున్న వీసా కౌంటర్ కనిపిస్తుంది. వీసా ఫీజ్ నేనే ఆన్‌లైన్‌లో కడతాను. జస్ట్ పాస్‌పోర్ట్‌లో ఎరైవల్ ఎంట్రీ వేయించుకోవడమే. విమానం మారి టకరోడీకి వస్తే అరైవల్ బయట నేను నిన్ను రిసీవ్ చేసుకుంటాను. ఏమంటావు డాలీ?"

"రాను."

"ఏడ్చావ్. ఎంతకాలం హైద్రబాద్‌లో ఏడుస్తూ మంచమ్మీద పడుకుంటావు. సమస్య సరిహద్దులో ఆగిపోక. కంచె అవతలికి చూడు. నువ్వు ఇక్కడికి వస్తే ఆ ఛేంజ్ ఆఫ్ ప్లేస్ చాలా సహాయం చేస్తుంది డాలీ."

ఆద్య నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"ఎన్నడూ, ఎవరూ, ఏ విషయంలో అక్కడే ఆగకూడదు. ముందుకి వెళ్ళాలి. నేను టిక్కెట్ కొంటున్నాను. నువ్వు వస్తున్నావు. ఇప్పుడే చెక్ చేసాను. నాన్ రిఫండబుల్ టిక్కెట్ చవక. నువ్వు రాకపోతే టిక్కెట్ రిఫండ్ రాదు. పన్నెండు వందల తొంభై తొమ్మిది డాలర్స్. నా డబ్బులు వేస్ట్ చేయకు డాలీ" చైత్ర గట్టిగా చెప్పింది.

అరగంట తర్వాత మళ్ళీ ఆమెనించి ప్రవర్ధనకి ఫోన్ వచ్చింది.

"అది వస్తానందా?" అడిగింది.

"నో అనలేదు. కాబట్టి వస్తుంది. డాక్టర్ ఇచ్చిన మందులకి బాగా నిద్రపడుతోంది."

"సరే. నాన్నతో మళ్ళీ కన్ఫర్మేషన్‌కోసం మాట్లాడాను. నాకు ఏది మంచిదనిపిస్తే అది చేయమన్నారు. దాని ఫోన్ తీసేసుకుని మంచిపని చేసారు. ఆ ఫోనే చాలమంది కొంపలని ముంచుతోంది. ముఖాముఖి మాట్లాడటానికి గల భయం

టెక్స్ట్ మెసేజెస్‌ని పంపడానికి ఉండదు. ఇందాకే వచ్చే శనివారానికి డాలీకి టిక్కెట్ కొన్నాను. ఆదివారం నేను దాన్ని టకరోడీ ఏర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకుంటాను. టిక్కెట్ కాపీ నీకు, డాలీ ఈమెయిల్‌కి కూడా కాపీ పెట్టాను. చూసుకోండి. నాన్నకి కూడా పంపాను. నాన్న ఆఫీస్‌నించి ఇంటికి వస్తూ టిక్కెట్ ప్రింటవుట్ తీసుకు వస్తారు. అది ఇక్కడుండే రెండు వారాలకీ దాని పేర హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుని ఆ సర్టిఫికెట్ పంపుతాను. ఆ ప్రింటౌట్ కూడా ట్రావెల్ డాక్యుమెంట్. దాన్ని అది దగ్గరుంచుకోవాలి. అన్నట్లు వెస్ట్ ఆఫ్రికాలోని, ఏదేశానికి రావాలన్నా ఎల్లో ఫీవర్ వేక్సినేషన్ ముఖ్యం. ఆఫ్రికాలోనే ఎల్లో ఫీవర్ ఉండేది. అదొస్తే బతకడం కష్టం. అది లేకుండా ఆఫ్రికాకి మన ఇమిగ్రేషన్ అధికారులు కూడా వెళ్ళనివ్వరు. ఆఫ్రికానించి తిరిగి మనదేశంలోకి రానివ్వరు. వెస్ట్ ఆఫ్రికాకి వచ్చేవారు ఆ వేక్సినేషన్ సర్టిఫికేట్‌ని చూపించాలి. అర్థమైందా? హైద్రబాద్‌లో రేపు దానికి ఎల్లో ఫీవర్ వేక్సినేషన్ వేయించి సర్టిఫికేట్ తీసుకోండి. పాస్‌పోర్ట్‌ని వేక్సినేషన్ సెంటర్‌కి తప్పనిసరిగా తీసుకెళ్ళాలి. ఆ సర్టిఫికేట్‌లో పాస్‌పోర్ట్ నంబర్ని రాస్తారు. అక్రాలో విమానం దిగాక పాస్‌పోర్ట్, ఎల్లో ఫీవర్ వేక్సినేషన్‌తోపాటు ఇదీ చూపిస్తే వీసా ఇస్తారు. ఆ రెండూ లేకుండా విదేశస్థులని ఘానాలోకి రానివ్వరు. డాలీకి ఇది మొదటి ఇంటర్నేషనల్ ప్రయాణం కాబట్టి ప్రొసీజర్ అంతా టైప్ చేసి నాన్నకి పంపుతున్నాను. నాన్న తెచ్చే ఆ ప్రింటౌట్ కూడా దగ్గరుంచుకుని ఆ చెక్ లిస్ట్‌ని ఫాలో ఐతే డాలీకి ప్రయాణంలో ఎలాంటి సమస్యా ఉండదు" చైత్ర మరికొన్ని సూచనలని చేసింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in